కథానిక :

# మనుషులూ - విలువలూ

ఎ ఎస్. రామారావు.

సాయంత్రం ఐదున్నర గంటలయింది.

ప్రొద్దుట్నుంచీ ఆఫీసు వదిలే పర్యంతమూ ఏకధాటిగా పనిచేసి అలసిపోయి యుండడం చేత ఉడిపి రెస్టారెంటులో జొరబడ్డాను. నెత్తిమీద పంకా తిరుగుతూ వుంటే వేడి వేడి కాఫీ ఓ కప్పు సేవించి, సేదతీర్చుకుని, దేవాలయం పూజారికి ముడుపుచెల్లించుకుని, బయటనున్న సంగికేశ్వరుణ్ణి దర్శించి వక్కపొడి పొట్లాం, చార్‌మినార్ సిగరెట్టూ తీసుకున్నాను. సిగరెట్టు ముట్టించి, ఆ నాలుగు రోడ్ల జంక్షనులో వచ్చిపోయే జనాన్ని చూస్తూ పేవ్‌మెంటుమీద ఒకప్రక్కను నిలుచున్నాను.

మౌంట్ రోడ్ మీద తెరిపిలేకుండా వచ్చిపోయే కార్లూ, సిటీబస్సుల గోదలూ, ఉడిపిలో సర్వర్ల కేకలూ, క్లీనర్ల ప్లేట్ల చప్పుళ్ళూ, పూజారి కాలింగ్ బెల్ గణగణలూ; దేవాలయంముందు ముష్టివాళ్ళ దీనాలాపాలూ, పేవ్‌మెంట్లమీద చెట్టపట్టా లేసుకు వస్తూ పోతున్న ఆడా, మగా; హోంకమింగ్ ఆఫీస్ గరల్సూ. రోడ్డు సైడ్ రోమియోలూ; పని మీద పోతున్న వాళ్ళూ, పనిలేక పచార్లు చేస్తున్న వాళ్ళూ- మొత్తముమీద రకరకాల మనుషులతో మౌంట్ రోడ్ సెంటర్ స్వర్గానికీ, నరకానికీ సరిహద్దులా కనిపించింది నాకు మట్టుకు. "ఓహోహో, ఏమి ప్రపంచం! ఏం మనుషులు ?!!" అనుకున్నాను. "దేశం స్వతంత్ర స్వాతంత్రం కావడమంటే యింతే కామోసు" అనిపించింది. "వెర్రితలలు వేస్తున్న నవనాగరికత, పిచ్చిపిచ్చి వేషాలు వేస్తున్న మనుషులూ- వీళ్ళేనా భారతీయ సంస్కృతికి వారసులూ, ప్రతినిధులూ ..?" అర్థంలేని ప్రశ్న అప్రయత్నంగా ఎదలో ఉదయించింది.

"ప్రశ్న అర్థం కానప్పుడు మౌనమే జవాబు" నాకు నేనే సమాధానం చెప్పుకున్నాను. నా సమాధానం నాకే నవ్వుపుట్టించి, లోలోన నవ్వుకున్నాను.

అప్పుడప్పుడే అసుర సంధ్యలు పల్కరించుకుని తమదారిని తాము పోయేయి. వాచీ చూసుకుంటే ఆరుంబావైంది. త్వరగా గూటికి చేరుకోవాలన్న కుతూహలంతో ముందుకు అడుగు వెయ్యబోయేను.

వెనుకపాటున ఒక వ్యక్తి నా వీపు చరచడంతో వేసిన అడుగు వేసినట్టే వుండిపోయింది.

నాలుగురోడ్ల కూడలిలో, జన సమ్మర్దం ఎక్కువగా వున్న ఆస్థలంలో మంచీ మర్యాద లేకుండా, నా అంతటి జెంటిల్మానుని అలా అవమాన పర్చడంతో అరికాలు మంట తలకెక్కింది. వెనుతిరిగి చూడకుండానే, ఎడంచేత్తో ఆవ్యక్తి కుడిగూబ పగలకొట్టాలనుకొని "ఏపని చేసినా ఒక్కమాటు ఆలోచించి మరీ చేయి" అన్న పెద్దల సుద్ది చటుక్కున జ్ఞాపకం రాగా ఓర్మి వహించి, ఎందుకైనా మంచిదని వెనుతిరిగి చూశాను.

"ఓరినీ.....నువ్వట్రా కూర్మావతారం!" అప్రయత్నంగా నోటివెంట వచ్చిన మాటలతో అంతవరకూ నాలో రగుల్కొంటున్న కోపం కాస్తా చల్లారిపోయింది.

"నేను కాకపోతే యింకెవరనుకున్నావురా? రామాన్ని యిలా నిలవేయగలిగే అధికారం, సాహసం యింకెవడికుంది? నిన్ను నిలవెయ్యగలవాడికి ఈ భూమిమీద నిలిచే యోగం వుంటోద్దూ?"

కూర్మం మాటలకి నాభుజాలెందుకనో కాస్త పొంగి, ఎదిగాయి.

"ఎన్నాళ్ళకి మళ్ళీ చూశానురా కూర్మం నిన్ను. ఒక్క ఊరివాళ్ళం, అన్నదమ్ములకంటె ఎక్కువగా కలిసి తిరిగినవాళ్ళం వున్నవూరు వదిలిపెట్టివచ్చినా, ఒకేవూళ్ళో వుంటూకూడా కలుసుకోవడమే గగనమై పోతుంది." ఆనందం పట్టలేక అనేశాను.

"ఏంచెయ్యనురా? ఎప్పటికప్పుడే కల్సుకుందామనుకుంటూ వుంటాను, తీరిక ఎక్కడా చిక్కడంలేదు పోనీ నువ్వేనా ఒక్కసారి మా యింటి కొచ్చావూ?" పిలుచుకుని నిలదీసి అడిగాడు కూర్మం.

వాడికేం తెల్సు- నేనెన్నిసార్లు వాడికోసం వెళ్లిందీ!

"చాలు [illegible]ాయి! [illegible]! మా సినిమా వాళ్ళతో [illegible] చికే, [illegible] ల్లోనే కాకుండా [illegible] సినిమాలు ఆడతారు నీకేం తెల్సు నేనొచ్చిందీ లేందీని? నేనెప్పుడూ మీ యింటికివచ్చినా మీ ఆవిడ నువ్వు కాల్షీటు వుండివెళ్లావనో ఔట్‌డోర్ షూటింగు కెళ్లావనో జవాబిచ్చేది. నాపని ఎప్పుడూ ఫేడౌట్లూ, కట్లూను. మరి మనం డ్యూయెట్లు పాడేదెప్పుడు?" నాకు తెల్సినంత మటుకు, వాడికర్థమయ్యే సినీభాషలోనే జవాబిచ్చాను.

"వెరీ సారీ రామం" ఎంతో బాధపడుతూన్నట్లుగానే అన్నాడు కూర్మం.

నా చేతులు పుచ్చుకుని డైలాగు చెప్పడములో వాడుపడిన అవస్థకు నాకు జాలిపుట్టిన మాట నిజం.

"అది సరేగాని ఏమిటి విశేషాలు?" అడిగాను.

"విశేషమేమరి. మీ రూంకు ఇప్పుడే వెళ్దాం అనుకున్నానుగాని, నువ్వుగూటికి చేరుకుంటావో లేదో నన్న అనుమానంచేత నా రాక రేపు మార్నింగుకు పోస్టుపోన్ చేశాను. అయినా నా అదృష్టంకొలది నువ్వేకలిశావు- అడబోయిన తీర్థం ఎదురైనట్టు.

"ఇంతకీ ఏమా అదృష్టం? ఏమాతీర్థం?" అడిగాను.

"మరేంలేదు- ఆదివారం మా పాప పుట్టిన రోజు సాయంత్రం పార్టీ ఏర్పాటుచేశాం. నువ్వు తప్పక రావాలి, నువ్వు రాకపోతే నేనెంతో బాధపడతాను. రాకపోతే నామీద ఒట్టే" అంటూ బ్రతిమాలుతున్నట్టుగా చెప్ప

నా నుంచి మాట మరీ తీసుకుని తనదారి తాను పోయేడు కూర్మం.

ఆదివారం...సాయంత్రం .... పాప పుట్టిన రోజు...కూర్మం పార్టీ—మళ్ళీ మరోసారి మననం చేసుకున్నాను.

తెల్లారితే శనివారం—ఆ రాత్రి గడిస్తే ఆదివారం—పాప పుట్టిన రోజు—సాయంత్రం పార్టీ—అనుకుంటూ ముందుకు నడిచాడు. నడుస్తున్నంతసేపు కూర్మం మనసులో కదలాడసాగాడు.

కూర్మం అసలు పేరు కూర్మావతారం. దాన్ని షార్ట్‌కట్ చేసి కూర్మం అని పిలుస్తారు తన వాళ్లూ, వూళ్లోవాళ్లూను. కూర్మం అదృష్టం పండి, సినీ ప్రపంచంలో పడ్డంతోనే వాడి స్వరూపంతోపాటు, వాడి పేరు స్వరూపం కూడా మారిపోయింది. ఆది మహావిష్ణువు ఏయే యుగాల్లో అవతారాలెత్తి, బురఖాలు తొడిగి, పేర్లు మార్చుకున్నట్టు కూర్మావతారం కూడా సినీ ప్రపంచంలో వెలిసి, సినీ జీవుల్లో కలసిపోయిన తర్వాత షార్ట్‌కట్‌ను యింకా ముక్కలుగా 'కట్' చేసి, ఆ 'కట్' చేసిన ముక్కల్ని 'కరెక్టు'గా ఎడిట్ చేసి నాజూకైన 'కుమార్' అన్న పేరును తయారు చేసుకున్నాడు. ఈ కుమార్ పేరు చెబితే ఆంధ్రదేశం హారతులు పడుతుంది. సినీ ప్రపంచానికి కుమార్ మకుటంలేని మహారాజు. కుమార్ ఎన్నో క్రొత్తముఖాల్ని వెండితెరమీద పరిచయం చేసి తారాపథాని కెత్తాడు. అందుకే కుమార్ అంటే సినీ సామ్రాజ్యంలో సామ్రాట్టు దగ్గర్నుంచీ వింజామరలు విసిరేవాళ్ళవరకూ తలవంచి 'సలాం' చేస్తారు.

ఇంతటి ప్రముఖమైన వ్యక్తి నాకు స్నేహితుడు. మామూలు స్నేహితుడు కాదు! చిన్నప్పట్నుంచీ ఒకేవూళ్లో, ఒకేబడిలో కలసి చదువుకున్నాం. ఒకే కంచంలోతిని ఒకే మంచంమీద పడుకున్న వాళ్లం. ప్రాణానికి ప్రాణం పణంగా ఒడ్డే గలంతటి స్నేహితులం.

కూర్మ—ఉర్ఫ్—కుమార్ తీసిన పిక్చర్లన్నీ ఎక్కడపడితే అక్కడ శతదినోత్సవాలు, అర్ధ శతదిన, పావు శతదినోత్సవాలు జరుపుకోవడంతో అతగాడి మార్కెట్ పెరిగిపోయింది. ఆయా వుత్సవాల సందర్భంలో జరిగిన టీ పార్టీలలో పాల్గొన్న పాత్రికేయులు, పనిలేని మంత్రులు, సినీ పరిశ్రమ నాలుగు కాళ్ళమీద నిలబడడానికి కారకులైన తెరవద్దర ప్రేక్షకులు అంతా కలసి ముక్త కంఠంతో కుమార్ ప్రతిభని పొగడ్డంతో కుమార్ పలుకుబడి మరీ హెచ్చిపోయింది. అతనిక్రింద పనిచేస్తే తమ భవిష్యత్తు బాగుంటుందనుకునే నటీనటులూ వున్నారు. గల్లా పెట్టెలు నిండుతాయనుకునే ప్రొడ్యూసర్లూ వున్నారు.

అంత ఖ్యాతి నార్జించుకున్నాడు కూర్మం.

ఆ కూర్మం నాకు ప్రాణస్నేహితుడు!

అలాటివాడు నా బోటిగాణ్ణి పిలిచాడంటేనే ఆకాశమంత ఎత్తు కెగిరాను. కూర్మం యింటికి నాడు సినీజీవులంతా వస్తారు. అతనింట్లో సినిమా ప్రపంచం రూపొందడంతో భూతల స్వర్గమే అవుతుంది. ఇంద్రసభని మైమరపింప జేస్తుంది. అంతమంది మహామహా నటీనటులమధ్య నేను! నన్ను అందరికీ పరిచయం చేస్తాడు కూర్మం.

నమస్కారాలు, షేక్‌హాండ్‌లూ; చిరునవ్వులూ.

బర్‌మంటూ కారొక్కటి దూసుకుపోయింది పక్కనుంచి.

ఒక్క ఎగురు ఎగిరి పేవ్‌మెంటు మీద పడ్డాను.

వెంట్రుక వాసిలో తప్పింది. లేకపోతే స్వచ్ఛమైన స్వర్గమే కనిపించేది.

ఏమైనా, కూర్మం యింటికి వెళ్ళాలనుకున్నాను — వాడంతగా ప్రాధేయ పడ్డాడు కనుక. నిజానికి, వాడంత గట్టిగా పిలవకపోయినా వెళ్లేవాణ్ణే. ఎందుకంటే— నాకూ ఈ మధ్య అందరిలా ఒక పిచ్చి పట్టుకుంది — సినిమాతారల్ని చూడాలనీ, "హాలో! సితారా!" అని పలకరించి ఆటోగ్రాఫు ఫోటోగ్రాఫు మీద తీసుకుని, చట్రం కట్టించి, పడకగదిలో ఎదురుగా గోడకు వ్రేలాడగట్టి కలలు కనాలని. అందుకని— కూర్మం యింటికి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను.

ఆరాత్రంతా నాకు సరిగా నిద్రలేదు. అందుకు కారణం— కూర్మం కూతురికి ఎలాంటి బహుమతి యివ్వాలి? అన్న సమస్య బుర్ర వేడెక్కించి సుఖంగా నిద్రపోకుండా చేసింది.

వాస్తవానికి నాబోటివాడికి యిది యక్ష ప్రశ్న. ప్రభుత్వం కొలువులో లోయర్ డివిజన్ గుమాస్తాగిరీ వెలిగిస్తున్న నాబోటి వ్యక్తి, అంత ఎత్తున వున్న వ్యక్తికి ఎంత విలువైన బహుమతి నివ్వగలడు? నేనెంత ఖరీదైన వస్తువు కొనిచ్చినా, అది మిగతా వచ్చే బహుమతులముందు దిగదుడుపే! ఎందుకంటే — ఆ వచ్చే వ్యక్తులు సామాన్యులు కారు. వేలకు వేలు ఆర్జిస్తూ, లక్షలు బ్యాంకుల్లో నిలవేస్తున్న వాళ్ళు. వాళ్ళెంత ఖరీదు పెట్టయినా కొనగలరు. ఆ పరిస్థితుల్లో నేను అపహాస్యం పాలవక తప్పదు. అదే నాబాధ.

అయినా— యింకా మధ్య ఒకరోజు టైం వుంది కనుక 'రేపా లోచిద్దాంలే' అని నన్ను నేను సమాధాన పర్చుకునేసరికి తలప్రాణం తోకకు వచ్చినంత పనైంది.

మర్నాడు ఆఫీసుకు వెళ్లానన్న మాటే కాని, మనసు మనసులో లేదు వాడు నా వైఖరిని ప్రత్యక్షంగా చూస్తున్న సహా గుమాస్తా రాయుళ్లంతా కారణం గుచ్చి గుచ్చి అడిగేరు. విషయం వివరించడమే తడవుగా "బ్రదర్! నీదేరా అదృష్టం అంటే" అంటూ కంగ్రాట్యులేట్ చేశారు అంతా.

వాళ్లకేం తెల్సు ఆ అదృష్టం ఖరీదు ఎంతో?

నేను పడుతున్న అవస్థ వాళ్లెలా అర్థం చేసుకోగలరు?

ఎద్దుపుండు కాకికి ఎప్పుడూ నొప్పికాదు.

ఎప్పుడూ లేంది నిన్న 'ఉడిపి' లోకి వెళ్లడమే యింతటి విషమ పరిస్థితికి దారితీసింది. వెళ్లిన వాణ్ణి— పనైపోగానే ఇంటికిపోతే ఎంత బాగుణ్ణు! కోరి కోరి కొరివితో తల గోక్కున్నట్లు పేవ్‌మెంటుమీద దిక్కులు చూస్తూ నిలబడ్డంతో, యిప్పుడు దిక్కుతోచక చస్తున్నాను. దీనికి పరిష్కారం ఏమిటి? ఎంత తక్కువ వెల బహుమతి కొనాలన్నా నావద్ద ప్రస్తుతం డబ్బులేదు. పైగా నెలాఖరు. అడిగితే అప్పుపెట్టే శిబిచక్రవర్తు లెక్కడుంటారు.

కూర్మం యింటికి వెళ్లకుండా వుంటే సమస్యే లేదనిపించింది.

కాని......

(తరువాయి 17 వ పేజీ)

నేను దగ్గరకు వెళ్ళి 'శ్యాం' అని పిలిచాను ఆ పిలుపువిని చిన్నది తలఎత్తి నా వంక చూస్తుందని ఆశించాను కాని ఏం మాట్లాడ కుండా శ్యామల వంగి నా పాదాలకి నమస్క రించ బోయింది.

'వద్దు శ్యాం' అంటూ నేను వారించ బోయాను.

నా పాదాలని తాకిన చేతులని కళ్ళకు అద్దుకుంది. ఆ శ్యామల సుందర వదనాన్ని నా చేతుల్లోకి తీసుకుని కళ్ళల్లోకి చూస్తూ

"మిసెస్ రుద్రాక్షమాల!" అని పిలిచాను.

ఊఁ

ఒక ముద్దుకు కరువై

కన్నులు మూసి నాకు చేరువవుతూ

ఆ చిన్నది 'కొంటెవాడా!' అని అన్నది.

సమాప్తం.

---

# మనుషులూ—విలువలూ

(10 వ పేజి తరువాయి)

కూర్మం మరిమరి చెప్పాడు- తప్పకుండా రమ్మని. నేను వెళ్ళకపోతే వాడు బాధ పడ వచ్చు. నాగురించి మరోవిధంగా భావించ వచ్చు అయినా- ఎప్పటికైనా కావల్సిన వాడు కూర్మం ఇప్పుడు డబ్బుకోసం ఆలో చించి వెళ్ళకం మానేస్తే- యికముందు ఏముఖం పెట్టుకుని కూర్మాన్ని పలుకరించ గలను ?

ఏమైనా వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను.

నాకున్న దనుకుంటున్న లేని గౌరవాన్ని అడ్డు పెట్టుకుని, వాడి హోదాకు, వాడివ్వ గల మర్యాదకు లోటు రానివ్వకూడదను కున్నాను.

వెంటనే సీట్లోంచి లేచి, ఏక ధాటిగా ఉత్త రాలు టైపు చేస్తున్న అవధాని దగ్గరకెళ్లి, నాపరిస్థితి నంతా చెప్పుకుని, అర్జెంటుగా ఓపాతికరూపాయలు అప్పుపెట్టమని ప్రాధేయ పడ్డాను. గుమాస్తాలందరిలోకి పిలిచినప్పుడల్లా 'ఉన్నాను'. అంటూ చిన్నమొత్తం జవాబిచ్చేది అవధానికేమరి!

నా అదృష్టమెలాటిదో చెప్పలేను కాని, అడగ్గానే అవధాని మరోమాట చెప్పకుండా పాతిక రూపాయలూ పర్సులోంచి తీసిచ్చాడు.

అవధాని యిచ్చిన నోట్లు జాగ్రత్తగా మడిచి జేబులో పెట్టుకోవడంతో నాలో ఒక్కమారు వేయి ఏనుగుల బలం వచ్చినట్లు ఫీలయ్యాను. అవధానికి కృతజ్ఞతలు చెప్పుకుని మళ్లీ సీట్లోకి వచ్చి కూలబడ్డాను

అప్పట్నుంచీ నాలో ఒకటే ఆరాటం ఎంత త్వరగా ఆఫీసు టైం అయిపోతుందా అని ఆఖ రికి నాలో సహనం కూడా చచ్చిపోవడంతో, హెడ్ క్లార్కు దగ్గర పెర్మిషన్ తీసుకుని, కూర్మం కూతురికి బహుమతి కొనడానికి బయ ల్దేరాను.

ఆ పోవడం పోవడం తిన్నగా మూర్ మార్కెట్ కు చేరుకునేసరికి గాని, నేనెంత దూరం నడిచివచ్చిందీ తెల్సుకోలేక పోయాను. అప్పుడు చెప్పాయి నా కాళ్లు తమబాధ సంగతి అయినా, అప్పటి నా ఉత్సాహంలో అదేమీ పట్టించుకోలేదు.

తొందర తొందరగా నడిచి 'డాల్స్ అండ్ టాయిస్' అమ్మే దుకాణాలను సమీపించాను. ఎంతో చిత్రమైనదీ, ఎవరూ కనీ వినీ ఎరుగని వస్తువును కొనాలన్న ఉబలాటంలో నా కళ్లు అదే పనిగా 'షో కేసు లోని వస్తువులన్నిటినీ పరిశీలిస్తున్నాయి.

'వాంగో సామీ! ఇంగె వాంగో!' వెనుక తట్టు నుండి గట్టిగా పిలుపు వినిపించడంతో వెనుతిరిగి చూశాను.

ఆ షాపు యజమాని నా వాలకం, వేషం చూసి నేను గోంగూర పచ్చడి గాణ్ణని పోల్చు కున్నట్లుంది. అంతలోనే భాషమార్చి 'రండి సార్. దయచేయండి యిలా కూర్చోండి. ఏలాటి బొమ్మలు కావాలి? మనుషులా, జంతు వులా? ఆడేవా, పాడేవా?' అని గుక్క తిప్ప కుండా అడుగుతూనే, నా సమాధానమైనా వినకుండా రకరకాల బొమ్మలూ, ఆట వస్తు వులూ కుప్పలా నా ముందున్న టేబిలు మీద పోశాడు.

అతని మాటలకు, చేష్టలకూ ఏమని బదులు చెప్పాలో తోచింది కాదు. వ్యాపారంలో మెలికలు తిరిగిన చేయి. నా బోటి వాళ్లను ఎందర్ని చూశాడో మరి! అతను చూపించిన బొమ్మలలోకెల్లా 'నాట్యరాణి' బొమ్మ నాకు చాలా నచ్చింది. 'కీ' యిస్తే చాలు నాట్యం చేస్తున్నట్లు కళ్లూ, తలా, చేతులూ త్రిప్పుతూ చుట్టూ తిరుగుతుంది. చిన్న పిల్లల్ని యిట్టే ఆకర్షిస్తుంది. ఎలా అయినా ఆ బొమ్మని కొనాలనుకుని ఖరీదడిగాను.

'మీ బోటి వాళ్లకు ఖరీదులతో ప్రసక్తి ఏమిటుండి? వస్తువు గొప్పతనం కాని! అడుగు తున్నారు కనుక చెప్పడం నా విధి. ముప్ఫయి రూపాయలు మాత్రం అంటూ 'మాత్రం' మీద నొక్కి చెప్పాడు అతను.

ఆ ఖరీదు విని నా నాలుక పిడచ కట్టుకు పోయింది పైగా, నా దగ్గర వున్నదంతా కలిపినా ముప్ఫయి రూపాయ లుండదు. అతగాడికేం తెలుసు నా పరిస్థితి. తేలిగ్గా ధర చెప్పేశాడు.

అయినా నాకు ఆ బొమ్మెంతో నచ్చింది. ఎలా అయినా బేరంచేసి కొనాలనుకున్నాను. అంత చక్కటి బహుమతిని చూసి నన్ను అందరూ మెచ్చుకుంటారనుకున్నాను.

వెంటనే బేరంలోకి దిగాను

పాతిక రూపాయలిస్తానన్నాను.

ఒక్క పైసా తగ్గించనన్నాడతను.

ఒక్క పైసా ఎక్కువ యివ్వనన్నా న్నేను.

నా వాలకం కనిపెట్టి ఒక్క మెట్టు దిగాడు.

అంత గట్టిగా పట్టు పట్టడం బావుండదని నేనూ ఒక మెట్టు ఎక్కాను.

ఇరవై తొమ్మిది.

ఇరవై ఆరు.

కొన్న ఖరీదు గిట్టలేదన్నాడు.

ఆశ వదులుకోమన్నాను.

అతడాశ వదులుకోదలచలేదు. మరో రూపాయి తగ్గించాడు.

నాకూ గురాశ తగదనిపించింది మరో రూపా యిస్తానన్నాను.

ఇరవై ఎనిమిది.

ఇరవై ఏడు.

బేరం తెగేటట్టు లేదు.

ఇవ్వలేనంటూ టేబిలుమీద బొమ్మలన్నిటినీ బీరువాల్లో ఎక్కడివక్కడ సర్దడం మొదలెట్టాను. నేను కోరుకున్న బొమ్మ తప్ప.

'సరే, నేనూ కాదనలేనంటూ అయిష్టంగానే అక్కణ్ణుంచి రెండడుగులు ముందుకు వేశాను.

'సార్, సార్, రండి సార్!'

వెనుతిరిగి మళ్ళా రెండడుగులు వేశాను.

'మీ మాటా కాదు. నా మాటా కాదు'. అన్నాడతను.

'ఇరవయ్యిడున్నర' అన్నానేను.

అతని ముఖం చేటంతయింది.

నా ముఖం ఎంతైందో చూసుకోవడానికి ఎదురుగా అద్దాలేవు

'రండిసార్, కూర్చోండి. ప్యాక్ జేసి యిస్తాను'. అంటూ కొట్లో కుర్రాణ్ణి కూల్ డ్రింక్ తెమ్మంటూ పంపించాడు.

పాకెట్టు అందుకుని డబ్బిచ్చాను. ఆడబ్బు చెల్లిస్తున్నప్పుడు నా చేతులు వణకసాగేయి. తాహతుకు మించిన పని చేస్తున్నట్లనిపించింది కాని కూర్మాన్నీ, అక్కడికి వచ్చే మనుషుల్నీ తల్చుకోగానే నా అభిప్రాయం మారిపోయింది. బిల్లు తీసుకుని, భద్రంగా మడిచి జేబులో పెట్టుకుని, ప్యాకెట్టుతో సహా రూం చేరుకున్నాను.

ఆ రాత్రి నేను పొందిన ఆనందం ఇంతా అంతా కాదు. మర్రోజు జరగబోయే ఉత్సవ వేడుకల్ని తలుచుకుని ఉప్పొంగిపోయేను. నా అదృష్టానికి నన్ను నేనే అభినందించుకున్నాను. తెల్లవారింది. ఆ శుభదినం రానే వచ్చింది. సాయంత్రం విందుకు తారా మండలమంతా తప్పక విజయం చేస్తుంది. 'బర్త్‌డే కేకు' కొయ్యటానికి ఏ మంత్రి వర్యుడో అవకాశం తీసుకుంటాడు. అధికార్లూ, వాళ్ళచుట్టూ ప్రదక్షిణాలు చేసేవాళ్ళూ ఎంతోమంది వస్తారు, అధికార్లకి కాపలా కాయడానికీ, అభిమాన తారల్ని దర్శించడానికీ పోలీసులు, ప్రజలు విరగబడి వస్తారు. గేటుముందు వరుసలు తీరి నిల్చున్న పోలీసులు, ప్రజలమధ్య నుంచి కూర్మం బంగళా లోనికి వెళ్తుంటే ఎంత...?!

ఉదయం లేచిన దగ్గర్నుంచీ మరోపని చెయ్యడం మానేసి ఆ సాయంత్రం కోసం 'మేకప్' లోనే వున్నాను. నా కున్న నాలుగు జతల బట్టల్లోనూ కాస్త బాగున్నది సాయంత్రానికి అట్టేపెట్టాను. ప్రత్యేకంగా ఆ నాడు సెలూన్‌కు వెళ్ళి గెడ్డం గీయించుకున్నాను. నాడు నేను పడ్డ తాపత్రయానికి నాకే నవ్వు పుట్టుకొచ్చింది.

కూర్మం యింటికి వెళ్ళడానికై రెండుగంటలకే తయారైనాను. జేబులో చూసుకుంటే నలభై పైసలకంటే ఎక్కువలేవు. ఎలిఫెంటు గేటునుంచి అభిరామపురం వెళ్ళిరావడానికి బస్సు ఛార్జీలకు కూడా చాలవు. అంచేత ఒక ప్రక్క నడవడం కన్న వేరేగతి కనిపించలేదు. ఆ నడవడం వెళ్ళేటప్పుడైతేనే బాగుంటుందనిపించింది. బస్సులో అయితే బట్టలు పాడవుతాయి. అదీకాక, పార్టీ పూర్తయ్యేటప్పటికి ఎంత రాత్రవుతుందో ఏమో! ఆ రాత్రి వేళ అంత దూరంనుంచి ఒక్కణ్ణీ ఈదురోమంటూ గూటికి చేరడం మాటలతో పనికాదు. అందుకని వెళ్ళేటప్పుడే నడవడానికి నిశ్చయించుకున్నాను. వెంటనే గదికి తాళం వేసి, అపురూపమైన బహుమతిని అతి జాగ్రత్తగా పట్టుకుని కాళ్ళకు బుద్ధి చెప్పాను.

కూర్మం ఇల్లు చేరుకునే సరికి నేనూహించినట్లే వుంది. అప్పటికే ఎన్నో రంగురంగుల కార్లు బంగళాముందు పార్కుచేసి వున్నాయి. గేటుముందు పోలీసులకూ, ఫిలిం ఫాన్సుకూ మధ్య ఘర్షణ జరుగుతోంది. ఆ జన సమూహం లోంచి తప్పించుకుని బంగళా ఆవరణలో పడే సరికి నరకంలోంచి స్వర్గంలోకి వచ్చినట్లు ఫీలు అయ్యాను. గేటు లోపల అందంగా అలంకరించుకున్న ఆడా, మగా శాల్తీలు ఆప్యాయంగా సగౌరవంగా సకల లాంఛనాలతో ఆహ్వానించారు. నాబోటివాడు అంత ఘన సత్కారాన్ని పొందడంతో ఆకాశాని కెగిరినట్లనిపించింది.

'స్టెప్స్' దగ్గర టిప్ టాప్‌గా నిల్చుని ఆహూతులందర్నీ విష్ చేస్తున్న కూర్మం నన్ను చూడగానే 'వచ్చేవటా! రావేమో ననుకున్నాను. వెళ్ళి హాల్లోకూర్చో, మళ్ళా కలుస్తాను.' అన్నాడు.

కూర్మం మాటల్లో అంతకుముందున్న ఆప్యాయత, స్నేహభావం మచ్చుకు కూడా కనిపించలేదు. పైగా 'ఎవ్వెందుకు వచ్చావు? కాక తాళీయంగా పిల్చిన పిలుపుకే రెక్కలు కట్టుకు వాల్తా వనుకోలేదు.' అన్నట్లు న్నాయా మాటలు. ఆ క్షణంలో ఎంత పొరపాటు పని చేశాననుకున్నాను.

మరుక్షణంలో, 'కూర్మం హృదయం నిర్మలమైంది. కాకపోతే తనంతట తాను వచ్చి ఎందుకు ఆహ్వానిస్తాడు? చిన్ననాటి మిత్రుణ్ణి కదా అని నాతో చొరవగా మాట్లాడి వుంటాడు. ఆ మాట కొస్తే-వాడింట్లో వేసుక నాగి కాదూ?' అని అప్పటికి సమాధాన పరుచుకుని హాల్లో ప్రవేశించాను.

ఆ విశాలమైన హాలు, దాన్ని నాలుగు ప్రక్కలా అంటిపెట్టుకుని వున్న పెద్ద పెద్ద గదులు అప్పటికే వచ్చిన వాళ్ళతో కిటకిట లాడుతున్నాయి. వాళ్ళలో చాలామంది నటీ నటుల్ని ఎన్నో మార్లు వెండి తెరమీద చూసాను కూడా. మెర్క్యురీ దీపాలు వెలుగులో తారలు ధరించిన చీరలూ, ఆభరణాలూ మిరుమిట్లు గొల్పుతూ హాలీవుడ్ చిత్రంలోని బాంక్వెట్ దృశ్యాన్ని కూడా త్రోసిరాజంటున్నాయి. అంతమంది ప్రముఖుల మధ్య కూర్చునే అదృష్టం కలిగినందుకు పరవశించింది అలానే ఒక కుర్చీలో చేరబడి, ఊహాలోకాలోకి పోయేను.

అయితే ఆస్థితి క్షణికమే! మైళ్ళకు మైళ్ళు నడిచి నడిచిరావడంతో ఆత్మా రాముడు గోల చెయ్యసాగాడు. అప్పటికే బేరర్లు టేబిల్సు మీద ఫలహారాలు అమరుస్తున్నారు. అవి చూస్తుంటే నాకు ఆకలి మరీ ఎక్కువ కాసాగింది. ఎవ్వరూ చూడకుండా ప్లేట్లు కాళీ చెయ్యాలనుకున్నాను కాని, సభ్యతకు సిగ్గుపడి, బలవంతంగా జిహ్వాచాపల్యాన్ని చంపుకున్నాను.

అంతలోనే చటుక్కున జ్ఞాపకం వచ్చింది. చేతులో వున్న బహుమతి సంగతి. అంత అపురూపమైన బహుమతిని స్వహస్తాలతో కూర్మం కూతురు కివ్వాలనుకున్నాను. కాని సాధ్యం కాలేదు. పైగా ఆహూతులంతా తమ బహుమతుల్ని ప్రక్క గదిలో వేరే వున్న టేబిల్ మీద పెడుతుండటంచూసి- అదే పద్ధతి కాబోలనుకుని నేనూ అదేమాదిరిగా ఆచరించాను.

అంతలో నేపథ్య గాయనీగాయకులు ప్రార్థనాలాపంతో కార్యక్రమము ఆరంభమైంది. సాంప్రదాయాలన్నీ పూర్తి కావడంతో సినీలోకంలో వృద్ధుడూ, సినీ సంస్కృతికి ప్రతినిధీ అయిన ఒకనాటి మహానటుడు ఆహుతులందరి తరఫునా కూర్మం కూతురి నాశీర్వదిస్తూ, కూర్మం ఘనతని కీర్తిస్తూ ప్రసంగించాడు పిమ్మట విందు ప్రారంభమైంది.

వచ్చిన పెద్దలంతా సభ్యతా సూచకంగా(?) అంత ఖరీదైన తిను బండారాలను మునివ్రేళ్లతో ముట్టుకుని చేతులు కడుక్కోవడం నాకు కష్టం మనిపించింది. యిలాంటి నవీన సాంప్రదాయాలు తెచ్చిపెట్టుకున్న పద్ధతులు సమర్థించే స్థితిలో లేను. అంత వెలగల 'డిష్'ను 'వేస్టు' చెయ్యడానికి మనసొప్పలేదు. పైగా కడుపులో కావుకావు మంటోంది. అంతేకాక అంత ఖరీదుగల బహుమతికి, ఆమాత్రం 'డిష్' ద్వారానైనా తృప్తి పరచకపోతే బావుండదనుకుని, సభ్యతకు జడవకుండా తలవంచుకుని నా కార్యక్రమాన్ని ప్రారంభించాను నా గురించి ఎవరేమనుకున్నా లక్ష్యపెట్టే స్థితిలో లేనప్పుడు

అంతలో ఆడంగులమధ్య కలవరం లేచింది. ఒకటే చప్పట్లు, కేరింతలు, నవ్వులూను. అందరి దృష్టులూ ఒక్కసారిగా అటు మళ్ళేయి.

సినీ తారల మధ్య కూర్చున్న శ్రీమతి కూర్మం — నేను కొన్న 'నాట్యరాణి'కి 'కీ' యిచ్చి టేబిలుమీద వుంచింది. 'నాట్యరాణి' నృత్యం చేస్తుంటే, ఆ బొమ్మతోపాటు చుట్టూవున్న తారామణులంతా నాట్యం చేయసాగేరు.

తెలుగుసినిమాలో గ్రూపుడాన్సులావుంది వాళ్ళంతా కలిసి గెంతడం!

అయితేనేం? అందర్నీ అంత గొప్పగా ఆకర్షించగలిగిన అంతటి అపురూపమైన బహుమతి కొనివ్వగలందులకు పరమానందం పొందేను. తాహతుకుమించిన బహుమతిని కొన్నప్పటికీ, ఆ క్షణంలోపొందిన ఆనందంతో పోల్చి చూసినప్పుడు బాధనిపించలేదు.

అయితే నేను పొందిన ఆనందానుభూతి క్షణికం మాత్రమే!

మరుక్షణం నెత్తిమీద పిడుగు పడినట్లు కూర్మం భార్య మాటలు వినిపించేయి.

ఆమె అంది— 'చాలా నాజూకైన బొమ్మ. కాల్ షీటు వుందని పాపం రోజాదేవి రాలేకపోయింది. పాపంటే రోజాదేవికి అపారమైన అభిమానం. ఆమే పంపించి వుంటుంది తన ప్రతినిధిగా 'నాట్యరాణి'ని అంటూ ఒకటే పొగడ్త.

'రోజాదేవిది కళాహృదయం' అంటూ చుట్టూ చేరిన వాళ్ళంతా ఒకే కీర్తన ఆలాపించసాగారు.

ఆ మాటలు విన్న నాకు మహా చిరాకు పుట్టుకొచ్చింది. అక్కడున్న వాళ్ళందరి మీద అపరిమితమైన అసహ్యం పుట్టుకొచ్చింది.

'ఆమెవరో తప్పించి మరొకరు ఆ బొమ్మను ఎందుకు కొనివ్వకూడదూ?' అనుకున్నాను.

అక్కడ నా ఉనికిని ఎవరూ గుర్తించనందుకు చాలా బాధపడ్డాను.

'ఆ బొమ్మను నేనే కొనిచ్చానన్నట్లుగా దానిమీద నాపేరు వ్రాసివుంచవల్సింది' అనుకున్నాను.

చేతులుకాలాక ఆకులు పట్టుకుని ఏం ప్రయోజనం?

కోపంలో, చిరాకులో, బాధలో ఆ బొమ్మను నేనేకొన్నానని గట్టిగా అరవాలనుకున్నాను. అప్పుచేసి, అంత ఖరీదైన, అపురూపమైన బొమ్మను నేను ప్రెజెంట్ చెయ్యడం; పేరు మరొకరిపరం కావడంతో నాలో సహనం చచ్చిపోయింది.

కూర్మంమీదా, అక్కడున్న వాళ్ళమీదా విపరీతమైన అసూయ కలిగింది. నన్ను పరాభవించడానికే కూర్మం నన్ను ఆహ్వానించాడేమోననిపించింది.

కడుపునిండా తినడంతో, ఒక్కసారి త్రేన్పు రావడం—నన్ను మొహమాటపరచింది.

మొహమాటానికీ. అభిమానానికీమధ్య జరిగిన సంఘర్షణలోపడి కొట్టుకున్న నేను, ఏం చెయ్యలేక, సాంఘిక తెలుగుచిత్రంలో, క్లయిమాక్స్‌సీనులో, నాగుకిముందు కథానాయకుడు ఆపసోపాలు పడ్డట్టుగా, తలలోకి వ్రేళ్లు పోనిచ్చి జుత్తు పీక్కున్నాను.

అప్పటికీ నాలో బాధ తీరలేదు. అభిమానంతో వచ్చే పర్యంతమూ అయింది.

చచ్చిన పామును యింకా చావబాదుతున్న అక్కడవాళ్ళంతా కలసి ఆ బొమ్మనీ, ఆకారనీ పొగుడుతూ వుండడంతో, యిక కూర్చోలేక, ఎవరితో చెప్పాచెయ్యకుండా, బంగళా వదిలి బయటికొచ్చి త్వరత్వరగా యింటిముఖం పట్టాను.

కూర్మం బంగళా నుంచి వినవచ్చే కేరింతలు చప్పట్లూ, నవ్వులూ మటుమాయం కావడంతో భూతల స్వర్గం అని భ్రమించిన సినీ లోకం లోంచి, భౌతిక ప్రపంచంలో పడ్డట్టు అనుభూతిని పొంది, తృప్తిగా, స్వేచ్ఛగా, స్వచ్ఛమైన చల్లనిగాలిని పీల్చాను.

అప్పుడే-ఎక్కణ్ణుంచో ఆకాశవాణి నుంచి సన్నగా, కమ్మని ఆధునిక గీతాలాపం వినిపించింది.

'వాకేలే విలువల మనుషులు!
ఇంతేలే మనుషుల విలువలు !!'

—


చదవండి — చందాదారులుగా
చేరండి.
ఆంధ్రుల అభిమాన పక్షపత్రిక
చుక్కాని
సాలు చందా 4-50 విడిపత్రిక 20 న॥పై